క్లుప్తంగా

షాదీఖానాకు స్థలం కేటాయింపు

ఇల్లెందు: పట్టణంలోని 19వ వార్డు గర్ల్స్ హైస్కూల్ వెనుక గల సింగరేణి స్థలంలో ముస్లిం మైనార్టీలకు షాదీఖానాకు 30 గుంటల స్థలాన్ని కేటాయించారు. ఈ సందర్భంగా ఆ స్థలాన్ని ఎమ్మెల్యే హరిప్రియ, జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగాల రాజేందర్ శనివారం పరిశీలించారు. మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీలకు ఈ ప్రభుత్వం ఎంతో చేస్తోందన్నారు. గురుకుల పాఠశాలలు నెలకొల్పి వారిలో విద్యాశాతం పెంచేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ అంకుషావలీ, ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావు, సయ్యద్ ఆజమ్, కడకంచి పద్మ, ఘాజీ, రబ్బానీ, అధికార ప్రతినిధి పులిగళ్ల మాధవరావు పాల్గొన్నారు.

చెక్ పోస్టు ప్రారంభం



చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

టేకులపల్లి: టేకులపల్లి మీదుగా ఇకపై నకిలీ విత్తనాలు, మద్యం, బియ్యం రవాణాను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టేకులపల్లి సెంటర్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మొట్టమొదటి చెక్ పోస్టును ప్రారంభించారు. అనంతరం తనిఖీలు చేపట్టారు. ఇక నుంచి ఎలాంటి అక్రమ రవాణాలు జరగకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిరంతరం నిఘా ఉంటుందని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణకు, అక్రమ రవాణా నివారణకు అన్నివర్గాల ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ రమణారెడ్డి పాల్గొన్నారు.

31న మండల సర్వసభ్య సమావేశం

పాల్వంచరూరల్: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 31వ తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.అప్పారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల ప్రగతి నివేదికలను ఈనెల 27లోపు కార్యాలయంలో అందజేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు



బహుమతులు అందజేస్తున్న తిరుపతిరావు

సుజాతనగర్: డాక్టర్ జీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సింగభూపాలెం గ్రామంలో జరుగుతున్న వాలీబాల్ పోటీలు శనివారం ముగిశాయి. రెండు రోజుల పాటు సాగిన ఈ క్రీడల్లో మొత్తం 12 టీములు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్ మాలబంజర, కోమటపల్లి జట్ల మధ్య ఉత్కంఠగా సాగింది. కోమటపల్లి టీం విజేతగా నిలిచింది. ఎస్సై పి.తిరుపతిరావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు అంజి, కృష్ణారావు, మధుకర్, జోగారావు, వంశీ, వెంకట్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న విశ్వనాథం

పాల్వంచరూరల్: నిరుపేద ముస్లిం విద్యార్థినికి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం శనివారం రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. మాట్లాడుతూ.. సీపీఐ పట్టణ కార్యదర్శి సాయిబాబు స్నేహితుడు మాచిని రాము జ్ఞాపకార్థం స్థానిక రాంనగర్‌కు ఎస్‌కే. షహనాద్ ఉన్నత చదువులకు ప్రతి సంవత్సరం రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లుని తెలిపారు. పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక సహాయం చేయడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, మహిళా సమాఖ్య రాంనగర్‌శాఖ అధ్యక్షురాలు పద్మ, కార్యదర్శి దాసరి లక్ష్మి, భాను తదితరులు పాల్గొన్నారు.



సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ తీసుకుంటున్న విద్యార్థినులు



కరాటేలో చిన్నారులు



బాస్కెట్ బాల్ ఆడుతున్న విద్యార్థులు

చలో..చలో.. సమ్మర్ క్యాంప్

- బాస్కెట్‌బాల్‌పై శిక్షణ ఇస్తున్న పాల్వంచ క్లబ్
- 12 ఏళ్లుగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్న క్రీడాకారులు
- కరాటేలో ప్రత్యేక తరగతులు



కేటీపీఎస్ కాలనీలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థినీ, విద్యార్థులు

సండే స్పెషల్

పాల్వంచ: వేసవిసెలవులను వృథా చేసుకోకుండా పిల్లలు వివిధ రకాల క్రీడాలపై ఆసక్తి చూపిస్తున్నారు. ఏప్రిల్, మేలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా ఉదయం, సాయంత్రం మైదానాల్లో ఉల్లాసంగా గడుపుతున్నారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి ఎంతో ఉత్సాహాన్ని ఇస్తాయనే ఉద్దేశ్యంతో తప్పనిసరిగా కొంత సమయాన్ని కేటాయిస్తున్నారు. బాస్కెట్‌బాల్, కరాటే, కిక్ బాక్సింగ్ వంటి మార్షల్ ఆర్ట్స్‌పై దృష్టి సారిస్తున్నారు.

12 ఏళ్లుగా బాస్కెట్ బాల్‌పై శిక్షణ..

పాల్వంచ బాస్కెట్ బాల్ క్లబ్ ఆధ్వర్యంలో 12 సంవత్సరాలుగా వేసవికాలంలో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. కేటీపీఎస్ కాలనీలోని క్రీడామైదానంలో విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ఉదయం, సాయంత్రం కోచ్‌లు గడ్డం విజయ్ రాజ్, కె.వాసు, రాకేశ్ శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థుల్లో శారీరక ధృడత్వం, పోటీతత్వం అలవడం కోసం బాస్కెట్ బాల్‌లో మెళకువలను నేర్పిస్తున్నారు. ఆడ, మగ పిల్లలు సైతం ఈ క్రీడపై ఆసక్తి చూపిస్తుండటం విశేషం. క్రీడలంటే భయం లేకుండా పట్టుదలతో ఆడాలని, క్రీడా స్ఫూర్తిని చాటుతూ ముందుకెళ్లేలా చేస్తున్నారు. సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ పొందిన వారు నేడు నేషనల్ స్థాయికి ఎదిగారు. శిక్షణలో పాల్గొనే విద్యార్థులకు క్లబ్ ఆధ్వర్యంలో టీ షర్ట్స్, క్రీడా సామగ్రిని అందజేస్తున్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు కూడా ఇస్తున్నారు. కేటీపీఎస్ అధికారులు సైతం గ్రౌండ్‌ను, లైటింగ్‌తో పాటు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ నెల చివరి వరకు ఈ శిక్షణ ఉంటుంది. జూన్‌లో జిల్లా స్థాయి పోటీల్లో సైతం క్రీడాకారులు పాల్గొనే అవకాశం ఉంటుంది.

కరాటే, కిక్ బాక్సింగ్‌పై క్యాంప్..

కరాటే, కిక్ బాక్సింగ్ సమ్మర్ క్యాంప్‌ను ఎక్స్‌ట్రీం మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కోచ్ సూరిబాబు ఆధ్వర్యంలో చేపట్టారు. ఇందులో ముఖ్యంగా 15 రోజుల పాటు విద్యార్థినుల కోసం ఆత్మరక్షణపై కళను పెంపొందించుకునేలా ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఇంటర్‌నేషనల్ కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్ గోల్డ్ మెడలిస్ట్ బి.శ్రీవిద్య, సెల్ఫ్ డిఫెన్స్ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్ షిప్ గోల్డ్ మెడలిస్ట్ ఎస్.వర్షిత ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. అదేవిధంగా అండర్ 14 విద్యార్థులకు జిమ్నాస్టిక్స్, కటాస్, ఎక్స్‌లెన్స్ ఫైట్ స్కిల్స్, మెడిటేషన్ వంటి వాటిపై తరగతులు నిర్వహిస్తున్నారు.

పన్నెండేళ్లుగా శిక్షణ ఇస్తున్నా



12 సంవత్సరాలుగా బాస్కెట్ బాల్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి వేసవిలో విద్యార్థులకు ఉదయం, సాయంత్రం శిక్షణ ఇస్తున్నాం. గేమ్స్ మెటీరియల్‌ను సైతం మేమే ఇస్తాం. విద్యార్థులు ఖాళీగా సమయాన్ని వృథా చేయకుండా గ్రౌండ్‌లో పోటీతత్వంలో మెళకువలు నేర్పిస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలి.

– గడ్డం విజయ్‌రామ్, బాస్కెట్ బాల్ కోచ్

ఆత్మ రక్షణ అవసరం



ఆడ పిల్లలు ఉన్నత చదువులకు వెళ్లేవారు, ఉద్యోగాల నిమిత్తం దూరప్రాంతాలకు వెళ్లేవారు ఆత్మరక్షణ కళ నేర్చుకోవాల్సిన అవసరం ఇప్పుడు ఎంతైనా ఉంది. చిన్నప్పటి నుంచే ఈ కళపై శిక్షణ పొందితే ఎంతో అనుకూలంగా ఉంటుంది. ఏదైనా సాధించాలన్న పట్టుదల ఇలాంటి మార్షల్ ఆర్ట్స్ ద్వారానే సాధ్యమవుతుంది.

– శ్రీ విద్య, సెల్ఫ్ డిఫెన్స్ కోచ్

మార్షల్ ఆర్ట్స్‌పై శిక్షణ ఇస్తున్నాం



మార్షల్ ఆర్ట్స్‌పై తాము నేర్చుకోవడంతో పాటు, పిల్లలకు శిక్షణ ఇస్తున్నాం. తాము నేర్చుకున్న విద్యను మరింత మందికి నేర్పించడం ఎంతో ఆనందంగా ఉంది. నాతో పాటు చిన్న పిల్లలు కూడా వచ్చి నేర్చుకుంటున్నారు. వేసవి సెలవుల్లో ఈ విధంగా సమయాన్ని కేటాయించడం మాకు ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– వర్షిత, కరాటే ఇంటర్నేషనల్ గోల్డ్ మెడలిస్ట్

తాగునీటి సమస్య పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సోనా

కొత్తగూడెంరూరల్: మండలంలో తాగునీటి సరఫరా జరగకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజాప్రతినిధులు ఏఈ వెంకటస్వామి నిలదీశారు. శనివారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని రైతు వేదికలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సోనా అధ్యక్షతన జరిగింది. తాగునీటి సమస్యపై ఎంపీటీసీలు నూనవత్ గోవింద్, తేజావత్ భద్రమ్మ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో బెల్ట్ షాపులు ఎక్కడబడితే అక్కడ వెలిశాయని, దీంతో గ్రామీణ ప్రాంతంలోని ప్రజలు మద్యానికి బానిసలవుతున్నారని ఎదురుగడ్డ సర్పంచ్ కవిత అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామాల్లో చెత్తచెదారం తొలగించటానికి నిధులు విడుదల కావటం లేదని కొందరు ప్రజా ప్రతినిధులు వాపోయారు. మండల పరిషత్ అధ్యక్షురాలు సోనా మాట్లాడుతూ.. తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంపీడీఓ రమేష్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రాంబాబు, ఎఎంసీ చైర్మన్ మండె హనుమంతరావు, సూపరింటెండెంట్ అంకుబాబు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ మార్చ్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న కోనేరు సత్యనారాయణ

చుంచుపల్లి: ఖమ్మంలో ఈనెల 27న బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరుద్యోగ మార్చ్‌లో అధిక సంఖ్యలో యువతీ, యువకులు పాల్గొని జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో రాష్ట్ర మంత్రి కేటీఆర్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బాధ్యత లేకుండా వ్యవహరించడం వల్లనే పేపర్ లీకేజీ జరిగిందని ఆరోపించారు. వేలాది మంది నిరుద్యోగులు ఆర్థికంగా నష్టపోయినట్లు చెప్పారు. వారి ఆత్మస్థైర్యం దెబ్బతిన్నదన్నారు. ప్రభుత్వం దీనికి బాధ్యత వహిస్తూ ఒక్కొక్కరికి రూ.1లక్ష నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. శ్రీనివాసరావు, రవీందర్, కోనేరు సత్యనారాయణ, లక్ష్మణ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి ప్రగతి భవన్‌కు పాదయాత్ర

పాల్వంచరూరల్: తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం, తెలంగాణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ నుంచి పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ రషీద్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ఉద్యమాలు చేసి పోలీసుల నిర్బంధాలు, లాఠీ దెబ్బలు తినడంతోపాటు జైలుకు వెళ్లి ఆర్థికంగా, సామాజికంగా చితికిపోయినట్లు వాపోయారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటిస్థలంలో ఇల్లు నిర్మాణం చేసి ఇవ్వాలని, కుటుంబ పోషణకు రూ.10లక్షల ఆర్థిక సాయం అందించాలని కోరారు. ప్రతినెల కనీసం రూ.10వేల పింఛను మంజూరు చేయాలని, అన్‌లిమిటెడ్ హెల్త్ కార్డులు, రైలు, బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎండీ.మంజూర్, శ్రీపాద సత్యనారాయణ, హుస్సేన్, ఎస్‌కె.నబీ, దేవదానం, ఐలయ్య, శ్రీను, యూసుఫ్, ముత్యం, గౌస్, జయరాజ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జూలూరుపాడు: మండల కేంద్రంలో బస్టాండ్, పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి బానోత్ ధర్మా, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు వై.గోపాల్‌రావు జూలూరుపాడులో మెయిన్ రోడ్డు పక్కన, చంద్రుగొండ క్రాస్ రోడ్ వద్ద ఉన్న బస్టాండ్ షెల్టర్లను రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చివేశారన్నారు. తిరిగి బస్టాండ్ షెల్టర్లను నిర్మించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. ఎండాకాలం ప్రయాణికులు మరింత అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. అదేవిధంగా పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడంతో మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు, మహిళలు ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే రాములు నాయక్ చొరవతో మెయిన్ రోడ్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం ఎంపీడీఓ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పారుపల్లి బాబూరావు, ఎం.కృష్ణయ్య, తోటకూరి నరేష్, జగదీష్, కంగాల వెంకటమ్మ, ఈశ్వర్, సీతారామ్, భీమా పాల్గొన్నారు.

డిప్లొమా అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సు ఉత్తీర్ణులైన విద్యార్థులు డిప్లొమా కోర్సులలో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రుద్రంపూర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.నాగమునినాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకేషనల్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు డిప్లొమా రెండో సంవత్సరంలో చేరేందుకు అవకాశం ఉందని వివరించారు. జూన్ 2వ తేదీ నుంచి 9 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

22న ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

జూలూరుపాడు: ఈనెల 22న మండల కేంద్రంలోని చంద్రుగొండ క్రాస్ రోడ్ వద్ద టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు ఆ పార్టీ నాయకుడు అరెం రామయ్య తెలిపారు. శనివారం జూలూరుపాడులో ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో చలమల గోవిందు, వడ్డె వెంకటనారాయణ, రోకటి నరసింహారావు, కోటంరాజు, పాదిలి రామారావు, దుద్దుకూరి లక్ష్మణ్‌రావు, సాయిన్ని నాగేశ్వరరావు, అనిల్ పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధి సాధించాలి



కుట్టుమిషన్లు అందజేస్తున్న శ్రీనివాసరామారావు

పాల్వంచరూరల్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా మహిళలు రుణాలు తీసుకుని స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్తగూడెం జనరల్ మేనేజర్ కె.శ్రీనివాసరామారావు అన్నారు. స్థానిక పట్టణంలోని నవభారత్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా నిర్వహిస్తున్న మహిళా సాధికార కేంద్రంలో హ్యాండ్ ఎంబ్రాయిడరీలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ ఇండియా హ్యాండీక్రాఫ్ట్స్ సర్వీసు సెంటర్ వరంగల్ ద్వారా హ్యాండ్ ఎంబ్రాయిడరీ టూల్ కిట్స్‌ను మేనేజర్ మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ శ్రీప్రభ చిల్లారి, డిప్యూటీ మేనేజర్ కృష్ణమూర్తి, సిల్ బ్రాంచ్ మేనేజర్ భరద్వాజ్, క్రాఫ్ట్స్ సర్వీస్ సెంటర్ ఆఫీసర్ మనీష్, చీఫ్ అడ్మినిస్ట్రేటర్ సీఎస్ఆర్ శ్యామ్‌సుందర్, మహిళా సాధికార కేంద్ర సిబ్బంది టి.అరుణ, వాసవి, రాణి, అముద పాల్గొన్నారు.

సకాలంలో వైద్యసేవలు అందించాలి



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా

పాల్వంచరూరల్: ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు డాక్టర్లకు సూచించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిని శనివారం ఎమ్మెల్యే వనమా అకస్మికంగా తనిఖీ చేశారు. వార్డుల్లో పేషెంట్ల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. ఆస్పత్రి ఆవరణంలో షెడ్ నిర్మాణానికి రూ.40 లక్షలు, లిఫ్ట్ ఎక్విప్‌మెంట్ కోసం రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే వెంట వైద్యులు ముక్కంటీశ్వరరావు, సోమరాజ్‌దొర, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాజ్‌గౌడ్, మహిపతి రామలింగం, సభ్యులు ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్ సెంటర్ ప్రారంభం



ట్రిపుల్‌ఆర్ సెంటర్‌లో వస్తువుల సేకరణను ప్రారంభిస్తున్న చైర్మన్ డీవీ, కమిషనర్ అంకుషావలీ

ఇల్లెందు: ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న వస్తువులను సేకరించి వాటి అవసరం ఉన్న మరొకరికి అందజేసేందుకు స్వచ్ఛ మున్సిపాల్టీ – స్వచ్ఛ ఇల్లెందు కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు శనివారం ప్రారంభించారు. మాట్లాడుతూ.. మూడు బృందాలుగా మున్సిపల్ కార్మికులను ఏర్పాటు చేశామని, ఇంటింటికి వెళ్లి వస్తువులను సేకరిస్తారని తెలిపారు. రోజుకు మూడు వార్డులో 30 మంది వర్కర్లు పర్యటిస్తుంటారని తెలిపారు. 8 రోజుల్లో 24 వార్డుల్లో వస్తువులను సేకరించి వాటిని వేరు చేసి మున్సిపల్ వెండర్ జోన్‌లో రెండు గదులు కేటాయించి అవసరమైన వారికి ఉచితంగా అందజేస్తామన్నారు. అందుకే ఈ సెంటర్‌కు ట్రిపుల్ ఆర్ అనే పేరు పెట్టారని, రెడ్యూజ్, రీయూజ్, రీసైక్లిన్ చేయనున్నట్లు తెలిపారు. పనికి రాని వస్తువులను రీసైక్లిన్ కోసం పంపిస్తామని తెలిపారు. ఈ మూడు రోజుల పాటు ప్రతిరోజూ మీ ఇంటి ముందుకొచ్చే మున్సిపల్ స్వచ్ఛ సర్వేక్షణ్ బృందాలకు సహకరించాలని కోరారు. ఇందుకోసం 30 మంది వర్కర్‌లకు ప్రత్యేక డ్రెస్ కోడ్ ఏర్పాటు చేశామని తెలిపారు. తెలంగాణ ఆవిర్భావం జూన్ 2న వెండర్ జోన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదుల్లో స్టాల్స్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. స్టాల్స్‌ను సందర్శించి తమకు అవసరమైన వస్తువులు సేకరించుకోవచ్చని తెలిపారు.

స్వచ్ఛ పాల్వంచకు సహకరించాలి



వస్తువులను స్వీకరిస్తున్న కార్యక్రమంలో పాల్గొన్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచరరూల్: స్వచ్ఛ పాల్వంచకు స్థానికులు సహకరించాలని డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు కోరారు. మేరే లైఫ్, మేరే స్వచ్ఛ షహర్ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధి పాత పాల్వంచలోని కమ్యూనిటీ హాల్ వద్ద ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానికులు తమ ఇళ్లల్లో మిగిలిపోయిన, ఉపయోగించని వస్తువులను సెంటర్‌కు తీసుకొచ్చి ఇవ్వాలని వాటిలో ఉపయోగపడే వస్తువులను అవసరమైన వారికి అందజేయడం జరుగుతుందన్నారు. ఉపయోగపడని వాటిని మున్సిపాలిటీ కేంద్రానికి తరలించడం జరుగుతుందన్నారు. పాత మున్సిపాలిటీ వద్ద మహిళలు సేకరించిన వస్తువులను మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ పరిశీలించారు.

22న ధర్నాను జయప్రదం చేయండి

టేకులపల్లి: టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కేజీబీవీ, యూఆర్ఎస్‌లో పనిచేసే ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది ఈనెల 22న కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కిషోర్ సింగ్ కోరారు. ఈ మేరకు శనివారం టేకులపల్లి మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేజీబీవీ, యూఆర్ఎస్‌లలో బోధన, బోధనేతర సిబ్బందికి 2016లో సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా స్పెషల్ ఆఫీసర్లను ప్రిన్సిపాల్‌గా, సీఆర్టీలను పీజీటీలుగా, పీఈటీలను పీడీలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రతి పాఠశాలలో కేర్ టేకర్‌ను నియమించాలని, ప్రతి ప్రిన్సిపాల్‌కు రూ.లక్ష రిజర్వ్‌డ్ ఫండ్ ఇవ్వాలని, పీఆర్సీ కమిషన్ సూచన మేరకు రూ.1000 ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు. అదేవిధంగా పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించాలని విన్నవించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. రామచందర్‌రావు, వీరన్న, తిరుపతి, బాలు నాయక్, కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల పనులు నిలిపివేత

సాక్షి ఎఫెక్ట్..



అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న ఈఈ అర్జున్, డీఈ రాంబాబు

చుంచుపల్లి: విద్యానగర్ కాలనీలోని చింతలచెరువు పరిసరాల్లో అనుమతులు లేని నిర్మాణాలపై ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. చింతలచెరువు బఫర్ జోన్‌లో యథేచ్ఛగా నిర్మాణాలు జరుగుతున్న నేపథ్యంలో శనివారం సాక్షిలో ప్రచురితమైన 'ఆక్రమణలో చింతలచెరువు'అనే వార్తా కథనానికి అధికారులు స్పందించారు. చెరువు పరిసరాలను ఇరిగేషన్ ఈఈ అర్జున్, డీఈ రాంబాబు, ఏఈ కిషోర్‌లు స్వయంగా పరిశీలించారు. పలువురు యజమానులను పిలిచి దగ్గరుండి చెరువు చుట్టూ అక్రమంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను నిలిపివేయించారు. ఎవరైనా చెరువు పరిసరాల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని ఈఈ హెచ్చరించారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు కూలీలైన్‌లో పారిశుద్ధ్య – పరిశుభ్రతపై శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ వై.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది వార్డులో ప్రత్యేకంగా వర్కర్లను, ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి వీధుల్లోని చెత్త కుప్పలను తొలగించారు. డ్రైయినేజీలను శుభ్రం చేశారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ అధికారులు నెలకోసారి వార్డుల్లో తప్పనిసరిగా పరిశుభ్రతపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. బ్లీచింగ్ చల్లించి దోమల బెడద నుంచి ప్రజలను రక్షించాలని పేర్కొన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న కుక్కల, పందుల నుంచి రక్షించాలని కోరారు. కోతులను పట్టి దూరప్రాంతాల్లోని అడవులకు తరలించాలని, ముఖ్యంగా మంచినీటికి ఇబ్బందులు లేకుండా రోజు విడిచి రోజు అందించేలా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. వార్డు స్పెషలాఫీసర్ కృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చారీ, ఆశోక్, జవాన్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

వ్యర్థాలపై కోతుల అల్లరి..

మండలంలోని బాలాజీనగర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రధాన రహదారి వెంట ఖాళీ స్థలంలో చిరు వ్యాపారులు వేసే బోండాలు, పండ్లు, అల్పాహార వ్యర్థాలను పడేస్తున్నారు. వీటిని రాత్రిపూట ఇక్కడ వేస్తుండంతో.. కోతులు గుంపులుగా ఆ వ్యర్థాలను చిందర వందర చేస్తున్నాయి. అంతేకాకుండా అటుగా వచ్చిపోయే బాటసారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. అధికారులు స్పందించి వ్యర్థాలను దూరంగా వేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– ఇల్లెందురూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : నీలిమ, పంచాయతీ కార్యదర్శి, బాలాజీనగర్
సెల్ నెంబర్: 9346931114